ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 3 నవంబరు 2024

అదే ఆకాశం.. అదే ఆనందం.. లేలేత కిరణాల సుకుమారం.. సరికొత్త పచ్చదనాల సోయగం.. అనారోగ్య తిమిరాన్ని తరిమే ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణం.. ఇంతటి చక్కటి ప్లేస్‌లో సేదతీరడానికి ఎవరూ మనకు భూపాల రాగంతో వేకప్ కాల్ ఇవ్వనక్కర్లేదు. గుడ్‌మార్నింగ్ చెబుతూనే రంగురంగుల సీతాకోకచిలుకల అందాలను ఆస్వాదిస్తూ.. ఆ ప్రపంచంలో పొద్దునే జర్నీ స్టార్ట్ చేస్తే చాలు.. ఆ మజానే వేరు. చెవిలో ఈయర్ ఫోన్స్ పెట్టుకుని రిథమిక్‌గా పాటలు వింటూ.. పచ్చటి లాన్‌లో నడుస్తూ.. పుట్టగొడుగుల్లో సేదతీరుతూ.. రండి.. జీవన మకరందాన్నంతా ఇప్పుడే ఆస్వాదిద్దాం. ఎంతలా అంటే.. ప్రతిపొద్దూ కొత్తగా అనేంతలా.. అంటూ ఆహ్వానిస్తోంది మూలపాడులోని బటర్ ఫ్లై పార్క్. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాశనమైన ఈ పార్కు.. కూటమి ప్రభుత్వం రాకతో సరికొత్తగా ముస్తాబవుతోంది. అసలే కార్తీకమాసం.. వనసమారాధనల సమయం.. పార్కును మరింత అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశముంది.



కొత్తగా రెక్కలొచ్చేనా..

మూలపాడు బటర్ ఫ్లై పార్కుకు సరికొత్త సొబగులు

- అర్చీల నిర్మాణ పనులు ప్రారంభం
- బ్యాంబూ మేజ్ పార్క్‌కు సన్నాహాలు
- రెండు వారాల్లో సీతాకోకచిలుకల ఆగమనం
- ట్రెక్కర్లు, వాకర్లతో సందడి
- కార్తీకమాసాన మరింత అభివృద్ధి చేస్తే ప్రయోజనం

8





సండే స్పెషల్



నేడే గాజుల అలంకరణ

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణార్థం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి గాజుల అలంకరణ చేయనున్నారు. దీంతో ఆలయ పరిసరాలను అన్ని రకాల మట్టి గాజులతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కేఎస్ రామారావు తగు భద్రతా ఏర్పాట్లు చేయించారు. ఆదివారం భక్తుల రద్దీ, గాజుల అలంకరణ దృష్ట్యా వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.





శిరస్త్రాణం శిరోధార్యం

హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ శనివారం మచిలీపట్నంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ గంగాధర్ సహా పోలీసు అధికారులు హెల్మెట్ ధరించి బైకులు నడిపారు.

8లో

అనాథలా..

మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా క్షేత్రం

- మెడికల్ కళాశాల నిర్మాణం కోసం తీసుకున్న భూమి
- ప్రతిగా రుద్రవరంలో 16 ఎకరాలు కేటాయింపు
- మూడేళ్లుగా భూమి అప్పగించకుండా పెండింగ్‌లోనే ఫైల్
- పరికరాలన్నీ గోడౌన్‌లో, సిబ్బంది తాత్కాలిక కేంద్రంలో..
- అంచనాలు రూపొందించినా అభివృద్ధి శూన్యం
- నిలిచిన పరిశోధనలు.. బీడును తలపిస్తున్న భూమి



రుద్రవరంలో వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి కేటాయించిన భూమి

నూతన వరి వంగడాలను కనుగొనడంలో పేరొందిన మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా క్షేత్రం మనుగడ కోల్పోయింది. గత పాలకుల నిర్లక్ష్యానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ క్షేత్రం ఆనవాలు కోల్పోగా, కీలకమైన పరిశోధనలు చేసే వీల్లేకుండా పోయింది. మెడికల్ కళాశాల నిర్మాణం నిమిత్తం తీసుకున్న భూమిని ఇస్తారో లేదో తెలియని పరిస్థితి ఏర్పడగా, పరిశోధనా పరికరాలు ఓచోట, సిబ్బంది మరోచోట ఉండిపోయారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలోని వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి చెందిన 26 ఎకరాలను మచిలీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణం కోసం తీసుకున్నారు. ఇందుకు ప్రతిగా మచిలీపట్నం మండలం రుద్రవరంలో కృష్ణా యూనివర్సిటీ, గురుకుల జూనియర్ కళాశాల సమీపంలో 16.34 ఎకరాలను క్షేత్రానికి కేటాయించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కేటాయింపులైతే చేసింది కానీ, నిధులు మాత్రం విడుదల చేయలేదు. సాగునీరు అందుబాటులో లేకపోవడంతో రెండేళ్లుగా ఇక్కడ ఎలాంటి పరిశోధనలు జరపట్లేదు. ఈ క్షేత్రానికి భూమిని అధికారికంగా అప్పగించేందుకు పంపిన ఫైలు మూడేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. భూమిని అధికారికంగా అప్పగించినట్టు ఉత్తర్వులైతే ఇచ్చారు కానీ, నిధుల విడుదల, భవనాలు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం లేకుండాపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వమైనా ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

మచిలీపట్నం రాడార్ కేంద్రం సమీపంలో 29 ఏళ్ల కిందట అన్ని హంగులతో 26 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ ఇప్పటివరకు ఎంసీఎం100, ఎంసీఎం101 వరి వంగడాలను శాస్త్రవేత్తలు ఉత్పత్తి చేశారు. చౌడు భూముల్లో అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలపై పరిశోధనలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఈ భూములను మచిలీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణానికి తీసుకున్నారు. కానీ, గత ప్రభుత్వం ఈ భూమిని వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి అప్పగిస్తూ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు ఇవ్వలేదు. భూమిని అప్పగించాలని మూడేళ్ల క్రితం అధికారులు ప్రభుత్వానికి ఫైలు పంపినా పట్టించుకోలేదు.

మిగతా 6లో..

అమరావతి ఐఆర్‌ఆర్‌లో మరో ముందడుగు

భూ సేకరణకు అత్యున్నత విధానాన్ని అనుసరించాలని సీఆర్‌డీఏ నిర్ణయం



ఇన్నర్ రింగ్‌రోడ్డు శాటిలైట్ మ్యాప్

- కన్సల్టెన్సీని నియమించుకునేందుకు టెండర్లు ఆహ్వానం
- భూ యజమానులకు మేలుచేసే అవకాశాలు పరిశీలన
- ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల్లో 41 గ్రామాల మీదుగా రింగ్‌రోడ్డు
- మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున నిర్మాణం

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్‌ఆర్) నిర్మాణంలో సీఆర్‌డీఏ స్పీడ్ పెంచింది. ఇన్నర్ రింగ్‌రోడ్డుకు అవసరమైన భూముల సేకరణకు అత్యుత్తమ పద్ధతిని సూచించేందుకు కన్సల్టెన్సీని నియమించాలని నిర్ణయించింది. దీనికోసం శనివారం టెండర్లు పిలిచింది. ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ఇటీవల అదానీ సంస్థ ముందుకొచ్చిన నేపథ్యంలో సీఆర్‌డీఏ మరో ముందడుగు వేసింది. ఐఆర్‌ఆర్ ఫైనల్ అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఈ ప్రాజెక్టు కోసం తీసుకోవాల్సి ఉంటుంది. భూములను సేకరించటానికి ఎలాంటి పద్ధతి అనుసరించాలన్న

మిగతా 6లో..

కొండంత దోపిడీ

ప్రభుత్వం మారినా గ్రావెల్ దోపిడీ ఆగలేదు. మైలవరం మండలం వెదురుబీడెం, చంద్రాల గ్రామాల నుంచి నిత్యం 200కుపైగా లారీల గ్రావెల్ తరలిపోతోంది. 2 ఎకరాల్లో తవ్వకాలకు అనుమతి తీసుకుని సుమారు 5 ఎకరాల్లో 10 నుంచి 15 అడుగుల లోతున తవ్వకాలు జరుపుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ దోపిడీలో సూత్రధారులంతా గత వైసీపీ ప్రభుత్వంలో దందా సాగించినవారే కావడం గమనార్హం.



వెదురుబీడెంలో గ్రావెల్ తవ్వకాలు

వెదురుబీడెం, చంద్రాలలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు

- ఐప్యాక్ మాజీ ఉద్యోగికి రెండు ఎకరాలకు అనుమతి
- ఐదెకరాలకు మించి 15 అడుగుల లోతు వరకు తవ్వకాలు
- జత కలిసిన ఇద్దరు వైసీపీ నాయకులు
- లారీలన్నీ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడివే..
- నిత్యం 200 లారీల తరలింపు.. రూ.కోట్లలో ఆర్జన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరం మండలం వెదురుబీడెం, చంద్రాల గ్రామాల పరిధిలో 2 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ అనుమతి పొందిన వ్యక్తి వైసీపీకి చెందినవాడు. ఆ ప్రభుత్వంలో హవా నడిపించిన ఐప్యాక్ ఉద్యోగి. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తనకు గ్రావెల్ తవ్వకాలకు ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన సదరు వ్యక్తి ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలోకి జంప్ అయ్యాడు. ఓ మైనారిటీ నాయకుడిని, వైసీపీ హయాంలో ఎమ్మెల్యే పీఏగా చక్రం తిప్పిన వ్యక్తిని కలుపుకొని గ్రావెల్ తవ్వకాలకు మార్గం సుగమం చేసుకున్నాడు. నిత్యం 200 లారీల గ్రావెల్‌ను తవ్వి నూజివీడు, విజయవాడ, గుంటూరుకు తరలిస్తున్నాడు. ఈ తరలింపులోని వారంతా వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పినవారేనని స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో గ్రావెల్‌ను దోచుకున్నది చాలక ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారంటూ టీడీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. తమకూ గ్రావెల్ తోలుకునేందుకు అనుమతులు ఉన్నాయని, కానీ వైసీపీ నుంచి వచ్చిన వారికే గ్రీన్ కార్పెట్ పరుస్తూ, తమ లారీలను అడ్డుకోవడం ఏమిటని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్‌పై కొద్దిరోజుల క్రితం మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 15 అడుగులకుపైగా గ్రావెల్ తవ్వేస్తున్నా మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లలో దోపిడీ

గత ఐదేళ్లలో మైలవరం నియోజకవర్గంలో రూ.వందల కోట్లలో గ్రావెల్ దోపిడీ జరిగింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని అప్పట్లో టీడీపీ నాయకుడు దేవినేని ఉమా పలుమార్లు డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైలవరం గ్రావెల్ దోపిడీపై సమగ్ర విచారణ జరుపుతామని ఆయన పేర్కొన్నారు. జగనన్న కాలనీల మెరక పేరుతో జరిగిన దోపిడీపై అప్పట్లో వైసీపీ నాయకులే నాటి సీఎం జగన్‌కు 4 పేజీల లేఖ రాశారు. మెరక పేరుతో ఇబ్రహీంపట్నం మండలంలోనే రూ.9.23 కోట్లు దోచేశారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి, ఈలప్రోలు, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం, జూపూడి, కాచవరం, కేతనకొండ గ్రామాల్లోని జగనన్న ఇళ్ల స్థలాలను మెరక చేసే పనిని ఉపాధి హామీ పథకం ద్వారా మైలవరం నియోజకవర్గ వైసీపీ నాయకులు దక్కించుకున్నారు.

అడ్డగోలు తీర్మానాలు

ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామ పంచాయతీ

మిగతా 6లో..

లారీలు వంశీ అనుచరుడివి..

గ్రావెల్ తరలించే లారీలన్నీ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడివని మైలవరం టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని వారు కొద్దిరోజుల క్రితం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు ఫోన్‌చేసి వంశీ అనుచరుడి లారీలను గ్రావెల్ తోలేందుకు అనుమతించవద్దని కోరినట్లు సమాచారం. అయినా నేటికీ అదే వ్యక్తి లారీల్లో గ్రావెల్ తరలిపోతూనే ఉంది.

మూడు రోజులే..

ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుకు గడువు ఈ నెల 6

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు కోసం ఇంకా మూడు రోజులే సమయముంది. అర్హులైన పట్టభద్రులంతా నవంబరు 6 వరకు మాత్రమే తమ ఓటుహక్కును నమోదు చేసుకునే వీలుంటుంది. ఫారం-18ను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌లో అందించాల్సి ఉంటుంది. గతంలో ఓటుహక్కు ఉన్నప్పటికీ కొత్తగా ఓటుహక్కును నమోదు చేసుకోవాల్సిందే. ఫారం-18ను పూర్తి చేయటంతో పాటు డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీపై గజిటెడ్ అధికారితో సంతకం చేయించి జత పరచాలి. అలాగే, ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలను కూడా జతపరచాలి. ఈ మొత్తం సెట్‌ను తహసీల్దార్ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌లో అప్పగించాల్సి ఉంటుంది. కాగా, నగరంలోని ఏపీఎన్‌జీజీవో భవన్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే గజిటెడ్ అధికారి అందుబాటులో ఉంటారు. ఇక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు దరఖాస్తు చేస్తారు. లేదంటే యూటీఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా ఓటరు నమోదు ఫెసిలిటేషన్ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. పట్టభద్రులు ఈ కేంద్రాలను ఉపయోగించుకోవచ్చు.

గుంతలరహితంగా తీర్చిదిద్దుతాం

- కేసరపల్లిలో మరమ్మతు పనులు ప్రారంభించిన కలెక్టర్ బాలాజీ

8లో

ముగ్గురు బాలురు అదృశ్యం

6లో

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై కేసు నమోదు

- అత్యాచార బాధితుల పేర్లు ప్రకటించారని ఫిర్యాదులో పేర్కొన్న వాసిరెడ్డి పద్మ
- మాధవ్, సాక్షి మీడియాపై పోక్సో చట్టం ప్రకారం చర్యలకు డిమాండ్

-కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడలో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును శనివారం ఆమె కలిశారు. అనంతరం కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. గోరంట్ల మాధవ్‌తో పాటు సాక్షి మీడియాపై పోక్సో చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాధవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో అత్యాచార బాధితుల పేర్లను సూపర్ 1, 2, 3 అని వ్యాఖ్యానించారని వివరించారు. అత్యాచార బాధితుల పేర్లను గోప్యంగా ఉంచాలనే విజ్ఞత మాజీ ఎంపీకి లేకపోతే, సాక్షి మీడియాకు లేదా అని ప్రశ్నించారు. బాధితుల పేర్లు చెప్పి వారిని నడిరోడ్డుపై నిలబెట్టారన్నారు. అత్యాచార బాధితులకు ముద్రవేసి బయటకు లాక్కొస్తే వారి భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. అత్యాచార ఘటనల్లో బాధితులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయస్థానాలే బాధితులను ఇన్‌కెమెరాలో విచారిస్తుంటే, మాజీ ఎంపీ, సాక్షి మీడియా మాత్రం వారిని ఊరేగిస్తున్నారని మండిపడ్డారు. కాగా, వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబరు 101/2024తో పోక్సో చట్టంలోని సెక్షన్ 24 కింద పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

బాధ్యత గల పార్టీలో చేరతా

తన రాజకీయ అడుగులు ఏ పార్టీ వైపు ఉంటాయన్న విషయాన్ని త్వరలో చెబుతానని వాసిరెడ్డి పద్మ వెల్లడించారు. రాజకీయాల్లో ఉండే నేతలు బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లో బాధ్యతగా ఉండే పార్టీలో చేరతానని, అటువంటి పార్టీలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.

వంశీ అనుచరుడు కోట్లుపై కేసు నమోదు

ఆటోనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు, గొల్లపూడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొమ్మా కోట్లుపై శనివారం పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సర్నాల విజయదుర్గ 2021 ప్రసాదంపాడు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకుంటే రూ.35 లక్షలతో పాటు కుమార్తెకు మెడికల్ సీటు ఇప్పిస్తానని కొమ్మా కోట్లు మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం తన కుమార్తెకు మెడికల్ సీటు కోసమని విజయదుర్గ వెళ్లితే కోట్లు అసభ్యకరంగా దూషించాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు 506 సెక్షన్ కింద పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజేఏసీ కృష్ణాజిల్లా చైర్మన్‌గా శ్యామ్‌గౌడ్



శ్యామ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మచిలీపట్నం టౌన్ , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీజేఏసీ అమరావతి కృష్ణాజిల్లా నూతన అధ్యక్షుడిగా ఎం.వి.శ్యామ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఇక్కడ జరిగిన ఎన్నికల్లో మహిళా విభాగం చైర్మన్‌గా ఆర్.కనకదుర్గ, అసోసియేట్ చైర్మన్‌గా టి.స్వర్ణలత ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన నాయకులను రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు అభినందించారు.

ముగ్గురు అన్నదమ్ములు అదృశ్యం

- ఇంటి నుంచి అంగన్‌వాడీ, పాఠశాలకు వెళ్లిన చిన్నారులు
- మచిలీపట్నంలో సంచలనం కలిగించిన ఘటన




తుమ్మా నాగేశ్వరరావు, దుర్గారావు



శ్రీనివాసరావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశా లకు వెళ్లిన ముగ్గురు అన్నదమ్ములైన చిన్నారులు అదృశ్యం కావడం మచిలీపట్నంలో శనివారం సంచలనం రేపింది. కాలేఖాన్‌పేట నాగులేటి ఒడ్డున నివసిస్తున్న యానాది కుటుంబానికి చెందిన తుమ్మా ప్రసాద్ దంపతులకు తుమ్మా నాగేశ్వరరావు (3), తుమ్మా దుర్గారావు(6), తుమ్మా శ్రీనివాసరావు(8) కుమారులు ఉన్నారు. వీరు అంగన్‌వాడీ కేంద్రం, కాలేఖాన్‌పేటలోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువు కుంటున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఈ ముగ్గురు తిరిగి రాలేదు. తల్లి అనారోగ్యంతో చనిపోయింది. తండ్రి వ్యవసాయ కూలి కావడంతో సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చూస్తే బిడ్డలు కనిపించలేదు. వారి కోసం చుట్టు పక్కల వెతికినా ఫలితంలేకపోవడంతో ఇనగుదురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఈ అంశంపై అన్ని పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేశారు.

టెన్నిస్‌లో గాలి జోషితకు ద్వితీయస్థానం



పతకాలతో జోషిత

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాకినాడలోని డీఎస్ఏ స్టేడియంలో గత నెల్లో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ టోర్నీలో యువ టెన్నిస్ క్రీడాకారిణి గాలి జోషిత అండర్-17లో ద్వితీయ స్థానంలో నిలిచింది. గొల్లపూడిలోని జైన్ కాలనీలో కేఏ టెన్నిస్ అకాడమీలో కోచ్ ఎస్కే నగర్ వలిచే వద్ద శిక్షణ పొందిన జోషిత సత్తా చాటింది. అండర్-14, అండర్-12 విభాగాల్లో గతంలో పలు పతకాలను జోషిత వశం చేసుకుంది.

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి ఏపీ జట్టు



ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు కృష్ణచైతన్య, జాషువా

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అనంతపురంలోని ఆర్‌డీటీ గ్రౌండ్స్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకు ఆతిథ్యం ఇచ్చే జాతీయ స్థాయి సీనియర్ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం డేనియల్ ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ జిలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, అండమాన్ నికోబర్ తదితర జట్లు బరిలో దిగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి కృష్ణచైతన్య, జాషువాలు చోటు దక్కించుకోవడం విశేషం.

ఆంధ్రప్రదేశ్ జట్టు ఇదే....

బి.మూర్తి, బి.వీర సాయి హర్షవర్ధన్(అనంతపురం), చక్రి(చిత్తూరు), జి.చందు(తూర్పు గోదావరి), వై.సూర్య తేజ(ఏలూరు), సౌరవ్(గుంటూరు), ఎస్.ప్రేమనాథ్(కాకినాడ), ఎ.మహేష్, టి.వంశీ వివేకానంద(కర్నూల్), పి.జాషువా, ఎస్.కృష్ణ చైతన్య(ఎన్టీఆర్), సూర్య సుధాకర్(నెల్లూరు), ఎస్కే ఇర్ఫాన్(పల్నాడు), పి.ఆర్.శివప్రసాద్, బి.మణికంఠ, ఎస్.ప్రవీణ్(సత్యసాయి), కె.జాకబ్ హెరాల్డ్(తిరుపతి), జి.రాజ్‌కుమార్, టి.ప్రదీప్(విశాఖపట్నం), పరమేష్, సునీల్(వైఎస్ఆర్ కడప), స్టాండ్ బైలుగా గణేష్(విజయనగరం), ఎ.అచ్యుత్(తిరుపతి).

ప్రతిబంధకాలు

- సీసీఐ నిబంధనలపై రైతుల ఆగ్రహం
- త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- నిబంధనల సడలింపుతోనే రైతుకు మేలు

సీసీఐ విధించిన నిబంధనలు పత్తి రైతులకు మేలు చేయకపోగా ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోత విధించడంతో పాటు తూకం తగ్గించడం వంటి వాటితో ఎక్కువ మంది రైతులు నష్టపోతున్నారు. ఆదుకోవాల్సిన సీసీఐ ఒక వ్యాపార సంస్థగా తయారైందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నిబంధనలు సడలించాలని రైతులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల): జిల్లాలో పత్తి తీతలు ప్రారంభమయ్యాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా లేవు. బయటి మార్కెట్లో గిట్టుబాటు ధర లభించటం లేదు. క్వింటాకు రూ. 6 వేలకు మించి ధర రావటం లేదు. దీనికి తోడు పత్తి తీతకు ఎక్కువ ఖర్చు అవుతుంది. దీంతో పత్తి రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకునేందుకు భారత పత్తి సంస్థ (సీసీఐ) ఈ నెల మొదటి వారంలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనుంది.

అడ్డంకిగా నిబంధనలు

సీసీఐ నిబంధనల వల్ల పత్తి అమ్ముకునే రైతులకు మేలు జరగకపోగా నష్టం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీసీఐ, సీఎం యాప్ ద్వారా పత్తి కొనుగోలు చేయనుంది. ఇప్పటికే ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు, రైతు సేవా కేంద్రాలకు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లు తీసుకువెళ్లి తమ పేర్లు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. యాప్‌లో నమోదు చేయించుకున్న రైతుల వద్ద మాత్రమే సీసీఐ పత్తి కొంటుంది. లేని పక్షంలో కొనుగోలు చేయదు. నాణ్యత లేని, రంగు మారిన, వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ తీసుకోదు. నాణ్యత కల్గిన పత్తిని మాత్రమే కొంటుంది.

తేమ శాతం ఎనిమిది లోపు ఉండాలి

2024-25 సీజన్‌కు సంబంధించి పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521. నిబంధనలకు అనుగుణంగా ఉన్న పత్తికి మాత్రమే సీసీఐ మద్దతు ధర ఇస్తుంది. ముఖ్యంగా పింజ పొడవు 29.50 నుంచి 30.50 మిల్లీమీటర్లు ఉండాలి. పొడవు 29.50 మిల్లీమీటర్ల కన్న తక్కువగా ఉన్నట్లయితే మద్దతు ధర కూడా తగ్గుంది. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం లోపు ఉండాలి. అంతకు మించి ఉన్నట్లయితే పత్తి కొనదు. ఎనిమిది శాతం లోపు ఉన్న పత్తికి మాత్రమే సీసీఐ మద్దతు ధర ఇస్తుంది. ఎనిమిది శాతం మించి 12 శాతం వరకు ఒక్కొక్క శాతానికి మద్దతు ధరలో ఒక శాతం (రూ.75.21) వంతున కోత విధిస్తుంది. తొమ్మిది శాతానికి రూ.7,445.79, 10 శాతానికి రూ. 7,370.58, 11 శాతానికి రూ.7,295.37, 12 శాతానికి రూ.7,220. 16 ధర మాత్రమే ఇస్తుంది.





సీసీఐ నిబంధనలతో ఏర్పాటు చేసిన బ్యానర్

నిబంధనలు సడలించాలి

సీసీఐ నిబంధనల వల్ల పత్తి రైతులకు మద్దతు ధర అందని ద్రాక్షగా తయారైంది. మద్దతు ధరలో కోత విధించటమే కాకుండ ఒక్కోసారి తేమ శాతం అధికంగా ఉందంటూ రెండు నుంచి ఆరు కిలోల వరకు తూకం కూడా తగ్గిస్తున్నారు. అడ్డంకిగా ఉన్న నిబంధనల వల్ల పలువురు రైతులు, బయటి మార్కెట్లో ధర తక్కువగా ఉన్నప్పటికీ సీసీఐకి అమ్మేందుకు ముందుకు రావటం లేదు. సీసీఐ నిబంధనలు సడలించాలని రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదు. దీంతో సీసీఐ వల్ల రైతులకు ఆశించిన ప్రయోజనం కలగటం లేదు.

సీసీఐ వ్యాపార సంస్థగా తయారైంది



రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ ఒక వ్యాపార సంస్థగా తయారైంది. లాభ నష్టాలను బేరీజు వేసుకుని సీసీఐ పత్తి కొంటుంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనపుడు, మద్దతు ధరకు కొనాల్సిన సీసీఐ సవాలక్ష ఆంక్షలతో పత్తి రైతులను దూరం పెడుతుంది. ఇప్పటికైనా సీసీఐ విధానాన్ని మార్చుకోవాలి.

-మూరకొండ ఏడుకొండలు, తెలుగు రైతు నాయకుడు, గనిఆత్కూరు

నిబంధనలు విధించటం సరికాదు



పత్తిని కొనేందుకు సీసీఐ నిబంధనలు విధించటం సరికాదు. నాణ్యతా ప్రమాణాలతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి. నాణ్యత లేదంటూ, తేమ శాతం ఎక్కువంటూ సీసీఐ కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయటం మంచి పద్ధతి కాదు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని నిబంధనలను సడలించాలి లేదా పూర్తిగా ఎత్తివేయాలి.

-తల్లపనేని నాగేశ్వరరావు, రైతు, గొట్టుముక్కల

చిల్లకల్లు సంతలో అనధికార వసూళ్లు

- పార్కింగ్ ఫీజు అంటూ దబాయింపు
- పోలీసులకు ఫిర్యాదు.. అదుపులో నిందితుడు



అనధికారికంగా ఏర్పాటు చేసిన బిల్లు పుస్తకం

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిల్లకల్లు సంత వద్ద అనధికారిక వసూళ్లు జోరుగా సాగుతున్నాయి. శనివారం సంతకు వచ్చిన సబ్ డివిజనల్ అధికారి కుటుంబ సభ్యులు తమకు కావాల్సిన జీవాలను కొనుగోలు చేసి యార్డుకు కట్టాల్సిన ఆశీలు కట్టి వాహనంతో రోడ్డెక్కుతుండగా పార్కింగ్ ఫీజు కట్టాలని ఓ వ్యక్తి డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న జెడ్పీ స్థలంలో జగ్గయ్యపేట మార్కెట్ యార్డు పర్యవేక్షణలో ప్రతి శనివారం జీవాల సంత నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రయ, విక్రయదారులు వ్యాపార లావాదేవీలు ముగించుకుని బయటకు వస్తున్న వాహనాల వద్ద కొంత మంది పార్కింగ్ పేరుతో బలవంతంగా వసూళ్లు చేస్తున్నారు. రైతులు ఎందుకు ఇవ్వాలని అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. దీనిపై కార్యదర్శి నరసింహారావును వివరణ కోరగా నిబంధనల మేరకు ఆశీలు మాత్రమే వసూలు చేస్తున్నామని తెలిపారు. పార్కిగ్ వసూళ్ల గురించి తనకు తెలియదన్నారు. చిల్లకల్లు పంచాయతీలో విచారించగా, సంతకు సంబంధించి వసూళ్లకు పాటలు నిర్వహించలేదని చెప్పారన్నారు. ఇప్పటికైనా పంచాయతీ, పోలీస్, మార్కెటింగ్ శాఖాధికారులు స్పందించి అక్రమ వసూళ్లను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా దుర్గమ్మకు ఆర్జిత సేవలు



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు



దీపం వెలిగిస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని దుర్గగుడిలో శనివారం శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకస్వాములు ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సహస్రలింగార్చన, ఊంజల్ సేవ, ఇతర ఆర్జిత సేవల్లో ఈవో కేఎస్ రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో భక్తులతో కలిసి దీపాలు వెలిగించారు. కార్తీకమాసం మొదటిరోజు కావటంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

చికిత్స పొందుతూ విజయనగరం జిల్లా వాసి మృతి

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి విజయవాడ వచ్చి ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విజయనగరం జిల్లాకు చెందిన లోకారపు గాంధీ (39) విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా మధురవాడ మండలం, కొమ్మాడికి చెందిన లోకారపు గాంధీ కుటుంబ సభ్యులతో అక్కడే ఉంటున్నాడు. ఇటీవల తాగుడికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో గాంధీ అక్టోబరు 28వ తేదీన భార్యతో గొడవపడి విజయవాడ వచ్చాడు. ఈనెల 1వ తేదీన రాజీవ్‌గాంధీ పార్క్ సమీపంలో ఉన్న లోబ్రిడ్జి వద్ద నుంచి బంధువులకు ఫోన్ చేసి తాను ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. కొద్దిసేపటి తరువాత ఎలుకల మందు తాగి స్పృహ తప్పి కింద పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం అతని బంధువులకు సమాచారం తెలియపరిచారు. బాధితుడు గాంధీ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువు జక్కు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కృష్ణానదిలో హైదరాబాద్ వాసి ఆత్మహత్య

కృష్ణానది ఇసుక ప్రదేశంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. కృష్ణానది ఇసుక ప్రదేశంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉన్నాడని సమాచారం పోలీసులకు తెలిసింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి పక్కన పురుగుల మందు డబ్బా, అతని జేబులో ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు ఉన్నాయి. మృతుడు హైదరాబాద్ తిరుమలగిరి, రాజు కాలనీ ప్రాంతానికి చెందిన విగేశ్న వెంకట నారాయణరాజు, తండ్రి సుబ్బరాజుగా పోలీసులు గుర్తించారు. కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు.



విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ సీవీఎన్ భాస్కరరావు, రీజనల్ హెడ్ శ్రీధర్, డిప్యూటీ జోనల్ హెడ్ శారదామూర్తి పాల్గొన్నారు. -ఆంధ్రజ్యోతి- విజయవాడ

అనాథలా..

(5వ పేజీ తరువాయి)

పరిశోధనలకు బ్రేక్

వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని ఖాళీ చేశాక వరి వంగడాల ఉత్పత్తి కోసం ఉపయోగించే పరికరాలను మచిలీపట్నం మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో ఉంచారు. ఈ క్షేత్రంలో పనిచేసే శాస్త్రవేత్తలు, సిబ్బంది పెడన రోడ్డులోని జిల్లా ఏరువాక కేంద్రంలో తాత్కాలికంగా ఉంటున్నారు. రెండేళ్ల క్రితం ఖరీఫ్ సీజన్‌లో కొంతమేర భూమిలో వరి వంగడాలను సాగు చేశారు. సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పైరు చనిపోయింది. రుద్రవరంలో కేటాయించిన భూమిలో చౌడు 20 శాతం మేర ఉందని, 8 శాతం మేర ఉంటేనే వరి వంగడాలపై పరిశోధనలు చేయడానికి ఆస్కారం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ భూమిని మెరకచేసి వ్యవసాయానికి అనుకూలంగా మార్చాల్సి ఉందని అధికారులు అంటున్నారు. అయితే, ఇలాంటి చర్యలేమీ ఇంతవరకు తీసుకోలేదు.

అమలుకాని హామీలు

ఈ క్షేత్రానికి కేటాయించిన భూమికి సాగునీటిని అందించేందుకు పంటకాల్వ, మురుగునీరు బయటకు పోయేందుకు డ్రెయినేజీ పూర్తిస్థాయిలో లేవు. రుద్రవరంలోని భూములకు సాగునీటిని అందించే కొత్తిమీరుకోడు పంటకాల్వ నుంచి ఈ క్షేత్రంలోని భూముల వరకు గతంలో చిన్నపాటి పంటకాల్వను తవ్వారు. భవనాల నిర్మాణం, గోడౌన్, చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ.5.80 కోట్ల అంచనాలు రూపొందించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఈ ఫైలు ఎక్కడుందో ఎవరికీ తెలియని పరిస్థితి. ఈ క్షేత్రానికి కేటాయించిన భూమి పక్కనే గురుకుల జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు రహదారి, విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. వీటిని మార్చాల్సి ఉంది. మూడేళ్లుగా వీటి మార్పునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఏడాది మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి సమీక్షా సమావేశం జిల్లా పరిషత్ సమావేశపు హాల్లో జరిగింది. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా, కలెక్టర్, ఎమ్మెల్యే పేర్ని నాని సమక్షంలో ఈ క్షేత్రానికి సాగునీటిని రప్పించేందుకు ప్రధాన పంటకాల్వ నుంచి ప్రత్యేక పైపులైన్ వేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశాలు జరిగిన ప్రతిసారీ ఈ క్షేత్రంలో కనీస వసతులు కల్పించే అంశంపై చర్చ జరగడమే తప్ప, ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదు. ఫైలుకు పట్టిన బూజును కూటమి ప్రభుత్వమైనా దులిపి నిధులు మంజూరు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు కోరుతున్నారు. ఈ క్షేత్రంలో గతంలో ఉత్పత్తి జరిగి ఆమోదం పొందిన ఎంసీఎం 100, 101 వరి వంగడాలు వివిధ జిల్లాల్లోని చౌడు భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు.

అమరావతి ఐఆర్‌ఆర్‌లో మరో ముందడుగు

(5వ పేజీ తరువాయి)

దానిపై కన్సల్టెన్సీ తగిన ప్రతిపాదనలు సూచించాల్సి ఉంటుంది. భూములను తీసుకోవటానికి భూ సేకరణ విధానం ఉన్నప్పటికీ.. ఇంకా అత్యుత్తమ ప్రతిపాదన ఏమైనా ఉంటే.. అది ఆమోదయోగ్యంగా అనిపిస్తే దానిని అమలు చేసే అవకాశముంది. భూములిచ్చిన వారికి కూడా ప్రయోజనకరంగా ఉండాలన్నది సీఆర్‌డీఏ భావన. ఈ ప్రాజెక్టుకు సహకరించిన భూ యజమానులకు కూడా మేలు జరిగే అవకాశాలను పరిశీలిస్తోంది. అందుకే భిన్న విధానాలతో కూడిన సలహాలు, సూచనలు, ప్రత్యామ్నాయాల కోసం కన్సల్టెన్సీ సంస్థను నియమించాలనుకుంటోంది. ఈనెల 18వ తేదీ లోపు బిడ్లను సమర్పించాలని సీఆర్‌డీఏ అధికారులు టెండరులో పేర్కొన్నారు. బిడ్ దక్కించుకున్నాక నెల రోజుల్లో నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. కన్సల్టెన్సీ నివేదిక వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని..

అమరావతిని రాజధానిగా ప్రకటించాక రాజధాని మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నాలుగు అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇన్నర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. రాజధానికి ప్రాంతీయ రోడ్ల అనుసంధానమయ్యేలా ఐఆర్‌ఆర్ నిర్మించడం మొదటి అంశం కాగా, విజయవాడ నగరానికి ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం రెండో అంశం. రాజధాని ప్రాంత పరిధిలోని మేజర్ రోడ్లన్నింటినీ అనుసంధానం చేయటం మూడో అంశం. అమరావతి, విజయవాడ చుట్టుపక్కల అర్బన్ ప్రాంతాల అనుసంధానం నాల్గోది. మొత్తం 96.25 కిలోమీటర్ల పొడవున 75 మీటర్ల వెడల్పుతో ఈ ఐఆర్‌ఆర్ సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించటం జరిగింది. అప్పట్లో ఐఆర్‌ఆర్‌ను ఫేజ్-1లో 67.57 కిలోమీటర్లు, ఫేజ్-2లో 26.68 కిలోమీటర్లు పనులు చేపట్టాలని భావించారు. ఫేజ్-1లో కేతనకొండ దగ్గర ఎన్‌హెచ్ -65కు, నున్న దగ్గర విజయవాడ పశ్చిమ బైపాస్‌కు ఐఆర్‌ఆర్ అనుసంధానం అవుతుంది. ఫేజ్-2లో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ మీదుగా 9 కిలోమీటర్ల మేర టన్నెల్‌ను నిర్మించాల్సి ఉంటుంది. అలాగే, పోలవరం కాల్వను కొత్తూరు తాడేపల్లి, నున్న దగ్గర ఐఆర్‌ఆర్ టచ్ చేస్తుంది. ఐఆర్‌ఆర్ కోసం మొత్తంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని 41 గ్రామాల్లో భూములను సేకరించాల్సి ఉంది.

ఐఆర్‌ఆర్ వెళ్లే గ్రామాలు ఇవీ..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అమరావతి మండలంలో ఎండ్రాయి, కర్లపూడి, వైకుంఠపురం, దుగ్గిరాల మండలంలో తుమ్మపూడి, మంగళగిరి మండలంలో చినకాకాని, చినవడ్లపూడి, కాజా, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, తాడికొండ మండలంలో కంతేరు, మోతడక, తాడికొండ, తుళ్లూరు మండలంలో అనంతవరం, హరిశ్చంద్రపురం, పెదపరిమి, వడ్లమాను గ్రామాలు ఉంటాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో జి.కొండూరు మండలం కవులూరు, వెలగలేరు, గన్నవరం మండలంలో రామచం ద్రాపురం, సావారిగూడెం, వెదురుపావులూరు, ఇబ్రహీంపట్నం మండలంలో దాములూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కేతనకొండ, కొండపల్లి, కొటికలపూడి, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, పెనమలూరు మండలంలో చోడవరం, గంగూరు, పెనమలూరు, పోరంకి, విజయవాడ రూరల్ మండలంలో దొనె ఆత్కూరు, నిడమానూరు, నున్న, పాతపాడు, కొత్తూరు తాడేపల్లి గ్రామాలున్నాయి.

రాజధాని అంతర్గత రోడ్లు ఐఆర్‌ఆర్‌కు అనుసంధానం

అమరావతి రాజధానిలో మొత్తం 27 అంతర్గత రోడ్లను 87.19 కిలోమీటర్ల మేర ఐఆర్‌ఆర్‌కు అనుసంధానించటానికి గతంలో సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంపై అప్పట్లోనే రాజధాని ప్రాంత గ్రామాల ప్రజలతో సమావేశాలు కూడా నిర్వహించారు. వారి సూచనలు, అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే డీపీఆర్ రూపకల్పన దిశగా అప్పటి ప్రభుత్వం అడుగులు వేసింది. ప్రస్తుతం ఏ పద్ధతిలో భూములను తీసుకోవాలన్న దానిపై అత్యున్నత ప్రతిపాదనలను అందించేందుకు సీఆర్‌డీఏ కన్సల్టెన్సీని నియమిస్తోంది.

కొండంత దోపిడీ

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకాధికారి ఆర్.దివాకర్ అధ్యక్షతన 2020, జనవరి 27న జరిగిన పంచాయతీ సాధారణ సమావేశం జరిగింది. ఇందులో 102వ ఐటమ్‌గా జగనన్న కాలనీల కోసం కొండపల్లి పంచాయతీ పరిధిలో సేకరించిన 30.34 ఎకరాలను ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి చేసేందుకు గ్రామసభ ఆమోదం తెలిపిందంటూ తీర్మానాన్ని ఆమోదించారు. 103వ ఐటమ్‌గా ఈ అభివృద్ధి పనులను వేగినేటి వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి ఇవ్వాలని తీర్మానించారు. ఈ సభ జనవరి 27 ఉదయం 11 గంటలకు జరిగినట్లు రికార్డుల్లో పేర్కొనగా, అదే సమయంలో పంచాయతీ సాధారణ సమావేశం కూడా జరిగినట్లు పేర్కొనడం గమనార్హం. ఆ తర్వాత జగనన్న కాలనీల మెరక పేరుతో ఎక్కడపడితే అక్కడ ఎడాపెడా గ్రావెల్ తవ్వకాలు జరిపారు. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో దేవదాయ భూములతో పాటు అటవీ భూముల్లోనూ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి ప్రభుత్వానికి చెందిన సహజ సంపదను దోచేశారు. పైగా అక్రమంగా తవ్విన మట్టిని తిరిగి ప్రభుత్వానికి విక్రయించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారు. సదరు వెంకటేశ్వరరావుకు తొలి విడత మొదటి నిధుల బదిలీ ఆదేశాల(ఎఫ్‌టీవో)ను 2020, మే 9న జారీ చేశారు. అప్పటి నుంచి విడతలవారీగా రూ.2.09 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత మరో రూ.7.14 కోట్లు చెల్లించారు. ఒక్క ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు రూ.9.23 కోట్లను మెరక పేరుతో కొల్లగొట్టేశారు. మైలవరం నియోజకవర్గం మొత్తం ఇదేస్థాయిలో దోపిడీ జరిగింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

అందరి సహకారంతోనే అభివృద్ధి : ఎంపీపీ అనగాని రవి

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ప్రభుత్వ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సూరంపల్లి సర్పంచ్ ఈలప్రోలు వాసు తన పంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని వాటిని నిర్మించాలని కోరారు. కేసరపల్లి లే అవుట్‌కు వంతెన నిర్మాణం చేయక పోవటం వలన గృహ నిర్మాణాలు చేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావటం లేదని సర్పంచ్ లక్ష్మీమౌనిక తెలిపారు.వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, కాలగడ్డ శివనాగ రాజకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, సూపరింటెండెంట్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.



సాధించిన పతకాలను చూపుతున్న విజేతలు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని హెచ్ఎం దుగ్గిరాల ఝాన్సీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న మానికొండ సాయి సత్య చిన్మాయ్ నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ హిప్పీ పోటీల్లో కాంస్య పతకం కైవసం చేసుకుని, జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకూ జరిగే అండర్-14 విభాగంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే జి.లోచన రాష్ట్రస్థాయి అండర్-17 సైక్లింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. ఈమె కూడా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు కె.గీత, జి.కృష్ణప్రియలను, విజేతలను శనివారం అభినందించారు.



స్వాములకు అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు

అయ్యప్పలకు అన్నప్రసాదం ప్రారంభం

పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోరంకి వసంత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో స్వాములు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమం జనవరి ఏడువరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కర్లపూడి సుబ్బారావు, తోటకూర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వనజాక్షి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ మహిళా నేత సాయికళ్యాణి

ఆలపాటి మాతృమూర్తి వనజాక్షికి ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాతృమూర్తి ఆలపాటి వనజాక్షి(95) వృద్ధాప్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని లక్ష్మీపురంలో గల వ్యవసాయక్షేత్రంలో ఉంచిన భౌతికకాయానికి తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, తదితరులు శనివారం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రమాదాలకు నిలయం!

- గోతులమయంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి
- లైట్లు లేక చీకటి పడితే ప్రమాదాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- లైటింగ్ ఏర్పాటు చేయాలంటున్న గ్రామస్థులు

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) ప్రమాదాలకు నిలయంగా మారింది. వంతెన గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయి. లైటింగ్ కూడా లేకపోవడంతో చీకటి పడితే గుంతలు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెనపై ప్రమాదాలను అరికట్టడానికి 2013లో అప్పటి సర్పంచ్ కాకాని అరుణ హయాంలో ఫ్లైఓవర్‌పై పంచాయతీ పరిధిలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. కొంతకాలం వెలిగించారు. ఆ తరువాత వచ్చిన పాలక వర్గం లైట్లు నిర్వహణ భారంగా మారడంతో పట్టించుకోలేదు. దీంతో వంతెనపై ప్రమాదాలు మరింత ఎక్కువ అయ్యాయి. గత నెలలో వంతెనపై ఏర్పడ్డ గుంతలకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మరమ్మతులు జరిపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ ఆ గుంతలు యథాస్థితికి చేరుకున్నాయి. తరుచూ పడుతున్న గుంతలకు పరిష్కార మార్గాన్ని చూపాలని, కనీసం అక్కడ ఉన్న స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుడా నివారించాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జిపై గుంతలు

కానూరు ప్రధాన రహదారి పనులకు శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని కానూరు ప్రధాన రహదారికి రూ. 25 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. దీంతో కానూరు ప్రధాన రహదారిలో ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభా కరరావు, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, కోసూరి రమేష్, ఇమాం, మాదు రామకృష్ణ, కరిమికొండ, బన్నీ పాల్గొన్నారు.

నిజమైన ప్రజాసేవకుడు ఎర్రన్నాయుడు



ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిజమైన ప్రజా సేవకుడు దివంగత కింజెరపు ఎర్రన్నాయుడు అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఎర్రన్నాయుడు 12వ వర్ధంతిని శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ యువనాయకులు బోడె వెంకట్రామ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బోడె సన్నీలు ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, షేక్ అన్వర్, మన్నే వాసు, మురళి, ఏనుగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

జాతీయ వినియోగదారుల ఫోరం

పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాధితులకు పరిహారం చెల్లించాలంటూ జాతీయ వినియోగదారుల ఫోరం తీర్పు నిచ్చింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. కానూరులో కొన్నేళ్ల క్రితం కేపీ రవీంద్రన్, పోలవరపు లక్ష్మీబాయి, కేవీవీకే దుర్గారాణి బిల్డర్ లక్కం ఈశ్వరరెడ్డి వద్ద తలో ఫ్లాట్‌ను కొనుగోలు చేశారు. అయితే వారికి ఇస్తానని ప్రామిస్ చేసిన కారు పార్కింగ్‌కు సరిపడ ఏరియా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టాడని వీరు ముగ్గురూ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. వీరి ముగ్గురి తరఫున డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు జాతీయ వినియోగదారుల ఫోరంలో వాదించగా అక్టోబరు 24న బాధితులు ముగ్గురికి రూ. 1.45, 1.35, 7 లక్షలను బిల్డర్ చెల్లించాలని జాతీయ వినియోగదారుల వివాదాల ఫోరం కమిషన్ తీర్పు ఇచ్చింది.



శోభాయమానం.. ఆకాశదీపం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస ప్రారంభ సందర్భంగా శివాలయాల్లో శనివారం శోభాయమానంగా ఆకాశదీపం వెలిగించారు. కార్తీకమాస సందర్భంగా శివాలయాల్లో ప్రతి ఏటా సంప్రదాయ బద్ధంగా ఆకాశ దీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. పెరికీడులోని ముక్తేశ్వరాలయంలో అర్చకులు కుందుర్తి శ్యామ్, సీతారామయ్య ప్రత్యేక పూజలనంతరం ధ్వజ స్తంభం వద్ద ఆకాశదీపాన్ని వెలిగించారు. నందూరి శర్మ, కొల్లిమర్ల రంగారావు, నక్కా బాబు, తదితరులు పాల్గొన్నారు. కానుమోలులోని శివాలయంలో అర్చకుడు పవన్‌శర్మ ఆధ్వర్యంలో ఆకాశదీపాన్ని వెలిగించారు. వీరవల్లి కొండేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడు మురళి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశదీపాన్ని వెలిగించారు. ఆకాశదీపాన్ని సందర్శించేందుకు వచ్చిన భక్తుల శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి.



పెరికీడు ముక్తేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు శ్యామ్, కమిటీ సభ్యులు

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

హనుమాన్‌జంక్షన్ : కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు ప్రారంభించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ ట్రస్టీ కాకాని బాబు, తవ్వా పూర్ణచంద్రరావు, ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఆలయధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీప ప్రజ్వలనతో కార్తీక మాస పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఇంటర్‌స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న చిరంజీవిదాస్

క్రీడాస్ఫూర్తితో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- భాష్యం బ్లూమ్స్ స్పోర్ట్స్‌మీట్‌లో వక్తలు

గుంటూరు(విద్య)/ పెనమలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని క్రీడా స్ఫూర్తితో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ప్రముఖ నటులు చిరంజీవిదాస్ అన్నారు. శనివారం విజయవాడ పోరంకిలోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్‌స్పోర్ట్స్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమికస్థాయి నుంచే క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి చేరడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. తొలుత స్పోర్ట్స్‌మీట్, భాష్యం బ్లూమ్స్ జెండాలను ఆవిష్కరించి క్రీడా జ్యోతిని విద్యార్థుల నుంచి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఆచారి, విజవాడ భాష్యం జడ్‌ఈవో జోషి, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, జడ్‌ఈవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైర్ల ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన

విజయవాడ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామ శివారుల్లో హైటెన్షన్ విద్యుత్ వైర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ పలువురు ప్లాట్ల యజమానులు శనివారం ఆందోళనకు దిగారు. గ్రామ సమీపంలో జనచైతన్య వెంచర్‌లో 16 ఏళ్లక్రితం పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే గత నాలుగు రోజుల క్రితం వెంచర్ మీదుగా ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఏర్పాటుకు పనులు చేపట్టింది. విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. అప్రూవ్‌డ్ లేఅవుట్లో తాము ప్లాట్లు కొనుగోలు చేశామని లేఅవుట్ మీదుగా విద్యుత్ వైర్లు ఎలా వేస్తారని ప్రశ్నిస్తూ తమ నిరసనను తెలి యజేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు కోరారు.



ఆందోళన చేస్తున్న ప్లాట్ల యజమానులు

రైతుల ఫిర్యాదుపై అధికారుల విచారణ

విజయవాడ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మిచౌంగ్ తుఫాన్ సమయంలో పంటలను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం నమోదు చేయలేదని ఉద్యాన శాఖ అధికారులకు నున్న గ్రామ రైతులు చేసిన ఫిర్యాదుపై శనివారం అధికారులు విచారణ చేపట్టారు. ఉద్యాన శాఖ డైరక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు నున్న గ్రామం చేరుకున్న అధికారులు గ్రామ రైతులతో రైతుభరోసా కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు వురు రైతులు మామిడి తోటల్లో అంతర్ పంట కింద మినుములు సాగు చేశామని మిచౌంగ్ తుఫాను కారణంగా పంటను పూర్తిగా నష్టపోయామని అధికారుల ముందు వాపోయారు. సుమారు 200 ఎకరాల్లో పంటను నష్టపోగా తుఫాను నష్టపరిహారం నమోదు చేయకుండా గ్రామ ఉద్యాన శాఖ సహాయకుడు నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గండిగుంటలో యువకుడి అనుమానాస్పద మృతి

ఉయ్యూరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి) : గండిగుంటలో యువకుడు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. ఉయ్యూరుకు చెందిన చింద మాధవదత్తరాజు (30) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బీటెక్ చదువుతున్న రోజుల నుంచి గండిగుంటకు చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్ నుంచి ఉయ్యూరు వచ్చిన మాధవదత్తరాజు శుక్ర వారం యువతి ఇంటికి వెళ్లాడు. రాత్రి కావ డంతో ఆమె కుటుంబ సభ్యులు వెళ్లిపోమని చెప్పి ఇంటి తలుపులు వేసుకున్నారు. తెల్లవారు జామున తలుపు తీసి చూడగా వరండాలో చీరతో స్లాబుకు ఉన్న హుక్కుకు ఉరి వేసుకుని వేలాడుతూ కన్పించడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకుని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తిప్పనగుంటలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శంకర గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ అండ్ రీసెర్చి సెంటర్ సహకారంతో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఇవాన్ ఆధ్వర్యంలోని వైద్యబృందం 216 మందికి కంటి చూపు నిర్ధారణ, రెటీనా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ అండ్ రీసెర్చి సెంటర్ పీఆర్‌వో మురళీకృష్ణ, కొమ్మారెడ్డి రాజేష్, అట్లూరి రాంబాబు, టీడీపీ అధ్యక్షుడు సాయిల నాగేశ్వరరావు, పండుబాబు, బాబ్జీ, బాలాజీ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు








కొత్తగా రెక్కలొచ్చేనా..?

● చురుగ్గా సాగుతున్న పనులు ● ఆర్చిల నిర్మాణ పనులు ప్రారంభం ● బ్యాంబూ మేజ్ పార్క్‌కు సన్నాహాలు
● మొదలైన కార్తీక సందడి ● మరో రెండు వారాల్లో సీతాకోకచిలుకల ఆగమనం ● పెరిగిన ట్రెక్కర్లు, వాకర్లు, సందర్శకుల రాక


బ్యాంబూ మేజ్







మూలపాడు బటర్ ఫ్లై పార్కుకు సరికొత్త సొబగులు

మూలపాడు బటర్ ఫ్లై పార్క్ అందంగా ముస్తాబవుతోంది! ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చటి ప్రకృతి కనువిందు చేస్తోంది. చల్లటి సెలయేళ్లు మనసును దూదిపింజల్ని చేస్తోంది. ఇప్పటికే కార్తీకమాసం ప్రారంభమైంది. వనభోజనాలు ఏర్పాటు చేసుకునేందుకు సందర్శకులు ఎదురుచూస్తున్నారు. శీతాకాలం ప్రారంభం కావటంతో మరి కొద్ది రోజుల్లో సీతాకోకచిలుకలు ఈ ప్రాంతానికి ఆగమనం చేయనున్న నేపథ్యంలో ప్రత్యేక ఆకర్షణలను ఇక్కడ తీర్చిదిద్దుతున్నారు. అయితే ఈ వేగం మాత్రం సరిపోదని, శరవేగంగా పనులు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

గత ప్రభుత్వ పాలనలో పడకేసిన మూలపాడు లోని బటర్ ఫ్లై పార్కును అద్భుతంగా రూపొందించే దిశగా పనులు జరుగుతున్నాయి. గతంలో ధ్వంసమైన గ్రాండ్ ఎంట్రీ స్థానంలో సరికొత్త ప్రవేశ మార్గాన్ని అభివృద్ధి చేశారు. రెండు వైపులా రాతి రాళ్లతో కోటను తలపించే నిర్మాణశైలిలో ప్రధాన ఆర్చి నిర్మాణ పనులు చేపట్టారు. వీటిపై రంగురంగుల సీతాకోక చిలుకలు రెక్కలు ఆడిస్తున్నట్టుగా కనిపించేలా ఆకృతులను తీర్చిదిద్దారు. ఈ ప్రధాన ద్వారం పక్కనే రాతిపై కృత్రిమ జలపాతాన్ని సృష్టించారు. ప్రధాన ద్వారం నుంచి లోపలికి వెళ్లిన తర్వాత మరో ఆర్చి నిర్మాణాన్ని కొత్తగా చేపట్టారు. వెదురుబొంగులతో ఏర్పాటు చేసినట్టుగా అనిపించేలా దీన్ని ఏర్పాటు చేశారు. పక్షుల సంరక్షణ కేంద్రాన్ని కూడా ముస్తాబు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రాంగణంలో చిల్డ్రన్స్ పార్క్‌ను అందుబాటులోకి తెచ్చారు. వెదురుమొక్కలతో కూడిన బ్యాంబూ మేజ్ పార్క్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వెదురు చెట్లను మేజ్ గార్డెన్‌గా ఉపయోగించాలని నిర్ణయించారు. మేజ్ గార్డెన్‌లోకి ప్రవేశించేలా అవసరమైన చోట్ల వెదురు చెట్లను తొలగించి మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎటు నుంచి ఎటు వెళుతున్నారో తెలియని విధంగా సందర్శకులు ఆశ్చర్యపోయేలా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఆ పనులు కూడా ఇప్పుడే మొదలయ్యాయి. గతంలో అనేక సెల్ఫీ పాయింట్లు, సీతాకోక చిలుకల కళాఖండాలను ఏర్పాటు చేశారు. ఇవి ధ్వంసం కావటంతో వీటి పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది రోజుల్లో వీటిని చేపట్టనున్నారు. ఈ ప్రాంతం ట్రెక్కర్లకు ఎంతో ఇష్టమైనది కావటంతో ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తూనే ఉన్నారు. సమీప ప్రాంతాలలోని సందర్శకులు భారీగానే వస్తున్నారు. ముఖ్యంగా వాకర్లు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఐదేళ్ల తర్వాత తిరిగి అభివృద్ధి పనులు జరుగుతుండటంతో వీటిని చూడటానికి కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వర్షాకాలం నుంచి శీతాకాలంలోకి ప్రవేశించే సమయంలో మూలపాడులోని బటర్‌ఫ్లై పార్క్ కొత్తందాలను సంతరించుకుంటోంది. ఈ ప్రాంతంలో నెమళ్లు కూడా కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సెలయేళ్లు కూడా కనువిందు చేస్తున్నాయి. అత్యద్భుతమైన అందాలను ఆవిష్కృతం చేస్తున్నాయి.






ప్రవేశ మార్గాలు


బ్యాంబూ మేజ్‌లోకి వెళ్లే ద్వారం






పార్కులోపల వాకింగ్ ట్రాక్

నెల రోజుల్లో 249 మందికి డీడీ జరిమానా

విజయవాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో నెల రోజుల వ్యవధిలో 249 మంది మందుబాబులకు న్యాయస్థానం జరిమానా విధించింది. నిత్యం ట్రాఫిక్ పోలీసులు నగరంలో ముఖ్యమైన ప్రదేశాల్లో డ్రంకెన్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అక్టోబరు 2 నుంచి శనివారం వరకు రైల్వే కోర్టు మొత్తం 249 మందికి జరిమానాలు విధించింది. వారిలో 40 మందికి రూ.15వేలు, మిగిలిన 209 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించింది. నగరంలోని వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. కారులో ప్రయాణిస్తున్న వారు సీటుబెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఆదేశించారు.

రేటింగ్ చెస్‌లో నాగ షణ్ముక్ ముందంజ



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కేయూ తొలి ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో ఫస్ట్‌క్లాస్ చదువుతున్న ఆరేళ్ల తాళ్ల నాగ షణ్ముక్ ఫిడే రేటింగ్‌లో 1410 పాయింట్లతో ముందంజ వేశాడు. అతి చిన్న వయస్సులో ఏపీలో అరుదైన రేటింగ్ నమోదు చేసిన షణ్ముక్ అందరి ప్రశంసలు పొందాడు. స్పార్క్ చెస్ నిర్వాహకుడు నరేష్ శిక్షణలో షణ్ముక్ ఇటీవల పలు పోటీల్లో సత్తా చాటాడు. షణ్ముక్‌ను స్ప్రింగ్ బోర్డు ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ చైర్మన్ కే రాజేంద్రరావు అభినందించారు.

కర్ణాటక ఆలయ పర్యటనకు భారత్ గౌరవ్ రైలుయాత్ర

రైల్వేస్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వేస్ భారత్ గౌరవ్ రైలు పథకంలో భాగంగా మొట్టమొదటిసారిగా కర్ణాటక ఆలయ పర్యటనకు ప్రత్యేక రైలును నడపనుంది. వీటికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కర్ణాటకలో 9 రోజుల పాటు ఆలయాల సందర్శన ఉంటుందన్నారు. డిసెంబరు 5న పర్యటన ప్రారంభమవుతుందని, కర్ణాటకలోని ప్రముఖ దేవాలయాలు నవబృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హోరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రహ్మణ్యం, మైసూరు, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శిస్తారన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజల కోసం గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్‌లో రైలు ఎక్కేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ప్యాకేజీ థర్డ్ ఏసీకి రూ.33వేలు, థర్డ్ ఏసీ ప్రీమియంకు రూ.37వేలు, సెకండ్ ఏసీకి రూ.40వేలుగా ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 93550 21516 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ట్రైన్‌టూ.ఇన్‌లను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గుంతల రహితంగా తీర్చిదిద్దుతాం

● కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ


కేసరపల్లిలో గుంతల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతల రహిత జిల్లాగా రహదారుల అభివృద్ధే లక్ష్యంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ (మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ)లో భాగంగా శనివారం గన్నవరం మండలం కేసరపల్లిలో మరమ్మతు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు కేసరపల్లి నుంచి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రహదారుల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మొదటి ప్రాధాన్యతగా 45 పనులకు రూ.14.76 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. వీటికి అదనంగా మిగిలిన పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు నాణ్యతతో కూడిన పనులు చేపట్టి వచ్చే సంక్రాంతిలోపు గుంతల రహిత జిల్లా లక్ష్యంగా రహదారుల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని రాష్ట్ర రహదారి, ప్రధాన జిల్లా రహదారుల మరమ్మతుల నిమిత్తం మొత్తం రూ.3.83 కోట్లు తొలి విడతగా మంజూరయ్యాయని, మరో రూ.3.61 కోట్ల పనులకు ప్రభుత్వానికి అంచనాలు తయారు చేసి పంపినట్టు వివరించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుల వడ్రానం హరిబాబు నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, ఆర్ అండ్‌బీ ఈఈ లోకేష్, తహసీల్దారు కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, టీడీపీ నేతలు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, జనసేవ, బీజేపీ నేతలు చలమలశెట్టి రమేష్‌బాబు, పవన్ కుమార్, బాలకృష్ణ, జూపల్లి సురేష్, ఎంవీఎల్ ప్రసాద్, జాస్తి విజయ భూషణ్‌కుమార్, మండవ లక్ష్మీ, మేడేపల్లి రమా, దేవినేని సులోచన మూల్పూరి మాధవన్, జాస్తి వీరబాబు, ఆనంద్, లావు వంశీకృష్ణ పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మీనా, ఎమ్మెల్యే గద్దె


కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే గద్దె

ఆటోనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని గుంతల రహితంగా తీర్చిదిద్దాలనే మహా సంకల్పంతో సీఎం ప్రత్యేకంగా గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌ను ప్రారంభించారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఆటోనగర్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద జిల్లా రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షల అంచనాతో చేపట్టిన మిషన్ పాట్ హోల్ ఫ్రీ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 1309 కిలోమీటర్ల పొడవైన రహదారులు ఉన్నాయన్నారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా తొలిదశలో జిల్లాలో రూ.7.71 కోట్లతో 54 పనులు మంజూరు చేశామన్నారు. 352 కిలోమీటర్ల పరిధిలో పనులు జరుగుతున్నాయన్నారు. మైలవరం 14, తిరువూరు 13, జగ్గయ్యపేట 8, నందిగామ 13, విజయవాడ తూర్పు 3, పశ్చిమ 2, మధ్య నియోజకవర్గంలో 2 చోట్ల పనులు చేపట్టినున్నట్టు వివరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో రహదారులనేవి కీలకమైనవన్నారు. గత ఐదేళ్లలో రహదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. రహదారుల సమస్యలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నట్టు వెల్లడించారు. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి చేసేందుకు పటిష్ఠ ప్రణాళికతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. దాదాపు లక్ష మంది కార్మికులు పనిచేసే ఆటోనగర్‌లో పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆర్డీవో కె.చైతన్య, ఆర్ అండ్ బీ ఎస్.ఈవ టి.సత్యనారాయణ, ఈఈ ఎస్.కృష్ణ నాయక్, డీఈఈ శశిభూషణ్, 4బీ గుత్తేదారు తుమ్మల జగదీష్, ఐలా మాజీ ఛైర్మన్ ఎస్.దుర్గాప్రసాద్, నేతలు గొల్లపూడి నాగేశ్వరరావు, కె. ఆంజనేయవాసు, జాస్తి సురేష్ పాల్గొన్నారు.

6న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నేతలు

బస్టేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పై ఈనెల 6న విజయవాడలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర్, జి.వి.నరసయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు జరిగే సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు 4 జోన్లు, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, 4 నాన్ ఆపరేషన్ రీజియన్లకు సంబంధించి రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు, 4 జోనల్ స్థాయి కోశాధికారులు హాజరవుతారన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు ప్రకటిస్తామని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

నూతన సూపరింటెండెంట్‌కు అభినందనలు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వజనాసుపత్రి నూతన సూపరింటెండెంట్ ఏవీ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన్ని ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏపీ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జీశ్యామ్ కుమార్, డాక్టర్ రత్నబాబు, డాక్టర్ నూరుల్లా, డాక్టర్ దుర్గాకుమారి, డాక్టర్ సరళ పాల్గొన్నారు.


ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నెట్టెం రఘురామ్, పలువురు నేతలు

ఎర్రన్నాయుడుకు ఘన నివాళులు

వన్‌టౌన్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా నెట్టెం రఘురామ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ గురుమూర్తి ఎర్రన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నెట్టెం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎర్రన్నాయుడు చేసిన సేవలను కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఉన్నంత కాలం ఎర్రన్నాయుడు చేసిన సేవలను గుర్తుపెట్టుకుంటుందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఎర్రన్నాయుడు కొన్ని వేల గ్రామాలకు మంచినీటి సరఫరా, రోడ్డు సౌకర్యాన్ని కల్పించారని గుర్తు చేశారు. మరోపక్క పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. వీవీ గురుమూర్తి మాట్లాడుతూ పార్టీ శ్రేణులందరూ ఎర్రన్నాయుడు అడుగుజాడల్లో పయనించాలన్నారు. పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నేతలు కోగంటి రామారావు పాల్గొన్నారు.

బీసీ ఐక్యవేదిక నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సుమన్ రాక

మధురానగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర బీసీ ఐక్య వేదిక నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సినీ నటుడు సుమన్ హాజరవుతున్నట్లు బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు పీవీఎల్ఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయనింటికి వెళ్లి ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆహ్వానం పలికిన స్పందించి రావడానికి అంగీకరించారన్నారు. బీసీల సమస్యలు, వాటి పరిష్కా రం పట్ల సుమన్‌కు మంచి అవగాహన ఉందన్నారు.



పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోండి

● ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి

వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో పశ్చిమ కృష్ణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కె.వి.శివారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటును నమోదు చేసుకునేందుకు గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎ.వి ద్యాసాగర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మంచి అభ్యర్థిని ఎన్నుకునేందుకు డిగ్రీ ఉత్తీర్ణులైన ప్రతి ఉద్యోగి వారి కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర సంఘం కోశాధికారి కె.రంగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి. సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, జి.రామకృష్ణ, ఎం.నాగేంద్ర, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సి.వి.ఆర్. ప్రసాద్, షేక్ నజిరుద్దీన్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల్లో లోపాలు గుర్తిస్తే చర్యలు

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలకు సరైన కారణాలు లేకపోయినా, మరణాల్లో ఇలాంటి లోపాలను గుర్తిస్తే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని, ప్రభుత్వ వైద్యులు జవాబుదారీతనంతో సేవలందించాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో జిల్లాలో జరిగిన రెండు మాత నాలుగు శిశు మరణాలకు గల కారణాలపై శనివారం నిధి మీనా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలపై పూర్తిస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి మరణాలకు గల కారణాలపై వైద్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఎవరికి వారు తమ తప్పేమిలేదని అంటున్నారని, అలాంటప్పుడు మరణాలు ఎందుకు సంభవిస్తాయన్నారు.మహిళ గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించి లోపాలను నివారించాలన్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో కలగరాదన్నారు. మాతా శిశు మరణాలు పునరావృతం కాకూడదన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ డీపీ జి.ఉమాదేవి, జీజీహెచ్ వైద్యులు డాక్టర్ ఆర్.సౌజన్య, డాక్టర్ సవిత, డాక్టర్ మదీన అహ్మద్, సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యురాలు డాక్టర్ ఎన్.సుమతి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ అమృతద, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హిందుమతి, టీబీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ, ఎం.నాగమణి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న వర్ల రామయ్య.

మేడ్‌కు సహకారం అందిస్తా

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

విద్యాధరపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యోగుల సంక్షేమం కోసం సమస్యలపై పోరాటం చేస్తున్న మేడ్ (మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్)కు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తెలిపారు. శనివారం విద్యాధరపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈనెల 9న గుంటూరు ఏసీ కాలేజీ ఆవరణలో జరిగే మేడ్ 7వ రాష్ట్ర మహాసభ కరపత్రాన్ని మేడ్ ప్రతినిధులతో కలిసి ఆయన విడుదల చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మేడ్ ద్వారా తన దృష్టికి వచ్చిన దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ ఈనెల 9న గుంటూరు మేడ్ 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పలువురు ముఖ్య అతిథులు హాజరు కానున్నట్లు వివరించారు. మేడ్ నేతలు కె.పున్నారావు, జి.బాబు, పి.రాజు, ఎస్.కిరణ్, కె.మన్మధరావు, శాంతి, పద్మ పాల్గొన్నారు.

9న వలంటీర్ల ఆవేదన సదస్సు

ధర్నాచౌక్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2 లక్షల 60 వేల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని వారి గోడును చంద్రన్నకు వినిపించాలని ఈ నెల 9న వలంటీర్ల ఆవేదన సదస్సును విజయవాడలో నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు తెలిపారు. స్థానిక హనుమాన్‌పేటలోని దాసరిభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. వలంటీర్లకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సీఎం చంద్రబాబు తన నిబద్ధత చాటుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవిందరాజులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం: ఎస్పీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం వల్ల సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చునని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ పేర్కొన్నారు. శనివారం కోనేరు సెంటర్‌లో హెల్మెట్ అవగాహన ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రహదారి ప్రమాదం అంటే మనిషి రోడ్డుపై పడటం కాదని, కుటుంబం రోడ్డుపై పడటమన్నారు. హెల్మెట్ భారంగా కాకుండా బాధ్యతగా ధరించాలని చెప్పారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో అధిక శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లేనని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు హెల్మెట్ ధరించి వాహనం నడిపే అలవాటు చేయాలన్నారు. కోనేరు సెంటర్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీలో ఎస్పీ స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ బి.సత్యనారాయణ, డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏవీ శివకుమార్, చిలకలపూడి సీఐ నబీ, ఇనగుదురు సీఐ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్థలంలో ఆక్రమణల తొలగింపు

● భారీగా మోహరించిన పోలీసులు ● కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడినా చివరికి ప్రశాంతం




జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు, మోహరించిన పోలీసులు

పెడన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ పోలీసు బందోబస్తు నడుమ రైల్వేశాఖకు చెందిన స్థలంలో ఉన్న ఆక్రమణలను శనివారం తొలగించారు. కొందరు రైల్వేట్రాక్ పక్కన ఉన్న రైల్వే స్థలాన్ని ఆక్రమించుకుని అందులో రేకుల ఇళ్లు, తాటాకు ఇళ్లు వంటివి వేసుకుని ఏళ్ల తరబడి నివాసముంటున్నారు. ఇళ్లు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచిస్తూ రైల్వే అధికారులు 8 నెలల క్రితం ఫారం ఏ, 6 నెలల క్రితం ఫారం బీ జారీ చేశారు. స్పందన లేకపోవడంతో 3 రోజుల క్రితం వీరికి రైల్వే అధికారులు ఇళ్ల తొలగింపునకు నోటీసులిచ్చారు. అయినా స్పందన లేకపోవడంతో శనివారం ఉదయం రైల్వే అధికారులు ఇళ్ల తొలగింపునకు సమాయత్తమయ్యారు. ఇళ్ల తొలగింపునకు రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ అధికారులు, ఆర్పీఎఫ్ పోలీసులు, జీఆర్పీఎఫ్, లోకల్ పోలీసులు శనివారం ఉదయం రైల్వేస్థలం వద్ద మోహరించారు. వీరి సహకారంతో ఆక్రమణలు తొలగించారు. స్థానిక ఇందిరా కాలనీలోని రైల్వేస్థలంలో ఉన్న ఇళ్ల తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. ఇందిరా కాలనీ నుంచి ప్రారంభమైన ఈ తొలగింపు గూడూరు రోడ్డులోని రైల్వేగేటు వరకు కొనసాగింది. ఇందిరా కాలనీ నుంచి గూడూరు రైల్వేగేటు వరకు రైల్వేట్రాక్ పక్కనున్న రైల్వేస్థలంలో ఉన్న 35 ఆక్రమణలను తొలగించారు. వీటి విస్తీర్ణం 1.48 ఎకరాలు. మొత్తం 35మంది ఆక్రమణదారులకు గాను వారిలో 33 మందికి ప్రభుత్వం ఇళ్లపట్టాలు కేటాయించగా ఇద్దరికి సొంత స్థలాలున్నట్టు అధికారులు గుర్తించారు. కాగా పెడన - బందరు రోడ్డులోని రైల్వేగేటు సమీపంలోని ఒక భవనాన్ని తొలగించే సమయంలో కొద్దిపాటి ఉద్రిక్తత నెలకొంది. రైల్వే అధికారులు తగిన ఆధారాలు చూపించడంతో ఉద్రిక్తత సడలింది. ఎలాంటి ప్రతిఘటనలు ఎదురుకాకుండా ఆక్రమణల తొలగింపు ప్రశాంతంగా ముగిసింది. రైల్వేశాఖ భీమవరం ఏడీఎం శంకర రామాంజనేయులు, విజయవాడ ఏడీఎన్ జి.నాగేంద్రప్రసాద్, కమిషనర్ ఎం.గోపాలరావు, తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్, టీపీవో సృజనకుమారి, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, 200 మంది పోలీసులు ఈ ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడిగుడ్ల ధర (100)	

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా

● సభ్యత్వ నమోదులో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చుల బోసుబాబు

మచిలీపట్నం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న నాయకులు, కార్యకర్తలకు రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చుల బోసుబాబు పేర్కొన్నారు. శనివారం నగరంలో పలు డివిజన్లలో టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ధొంతులమ్మ దేవాలయ ప్రాంగణం వద్ద బచ్చుల బోసుబాబు, పార్టీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా పాల్గొన్నారు. 17వ డివిజన్‌లో టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం సభ్యత్వ నమోదును పర్యవేక్షించారు. 45వ డివిజన్‌లో ఫణికుమార్ సభ్యత్వ నమోదు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● డీఎస్పీ మురళీధర్ హెచ్చరిక

అవనిగడ్డ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్దేశపూర్వకంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా, ఇతరలను కించపరిచేలా ఫ్లెక్సీలు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. అవనిగడ్డలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫ్లెక్సీని దగ్ధం చేసిన ఘటనను పురస్కరించుకుని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీ నుంచి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెట్టొద్దని, అందులో ఇతరులను కించపరిచేలా సందేశాలు ఉండకూడదని ఆయన సూచించారు. ఇతరులను కించపరిచేలా ఫ్లెక్సీలు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతరులు పెట్టిన ఫ్లెక్సీలను ఎవరైనా ధ్వంసం చేసినా చర్యలు తప్పవన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరుల ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్టింగ్ చేయొద్దన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా ఫ్లెక్సీలు పెడితే వాటిని పంచాయతీలే తొలగించాలని, అందుకు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. సీఐలు యువకుమార్, ఈశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

చల్లపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన శనివారం ఉదయం 216 జాతీయ రహదారిపై మంగళాపురం అడ్డరోడ్డు వద్ద జరిగింది. మచిలీపట్నం మండలం నెలకుర్రు గొల్లపాలేనికి చెందిన గొరిపర్తి నాగరాజు(35) తోట్లవల్లూరు మండలంలోని లంకల్లో గొర్రెలను మేపుతుంటాడు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి శనివారం ఉదయం తన ద్విచక్రవాహనంపై లంకలకు మంగళాపురం మీదుగా వెళుతుండగా హైవే ఎక్కుతున్న సమయంలో మచిలీపట్నం వైపు నుంచి అవనిగడ్డ వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో నాగరాజు రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మృతుని తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజు మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు సహకారమందిస్తా

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. కలంకారీ ఆర్టిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన కలంకారీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలలో ఆయన మాట్లాడారు. కలంకారీ పరిశ్రమ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని ఆయన తెలిపారు. క్లస్టర్ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు వివరించారు. కమిషనర్ ఎం.గోపాలరావు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మచిలీపట్నం జువెలరీ పార్కు అధ్యక్షుడు పి. సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగితను కలిసి ఏవో

గూడూరు మండల నూతన వ్యవసాయ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.అంజనేయకుమార్ శనివారం పెడనలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎస్సై సత్యనారాయణతో మాట్లాడుతున్న టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

వైసీపీ మత్తు వీడండి

● టీడీపీ కార్యకర్తలపై దాడులు సహించం

● పోలీసులకు కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరిక

మోపిదేవి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికైనా వైసీపీ మత్తులో నుంచి బయటకు రావాలి. టీడీపీ కార్యకర్తలపై వైసీపీ ప్రోద్బలంతో దాడులు చేస్తే సహించేది లేదు.' అని పోలీసులను నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం టీడీపీ నాయకులతో కలిసి ఎస్ఐ సత్యనారాయణను ఆయన కలిశారు. ఇటీవల కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదుపై దాడికి పాల్పడటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయడమేంటని నిలదీశారు. గ్రామంలో విద్వేషాలు రెచ్చగొడుతున్న వైసీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకోకుండా గాయపడిన యువకులనే రోజూ స్టేషన్‌కు పిలిపించడమేంటని ఎస్ఐను నిలదీశారు. గతంలో అనేక పర్యాయాలు మండలంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడినా, ఫిర్యాదులు చేసినప్పటికీ కేసులు తారుమారు చేశారని తన దృష్టికి వచ్చిందన్నారు. మూడు నెలలుగా మండలంలో పోలీసుల తీరుపై అనేక ఫిర్యాదులు వస్తున్నా మార్పు రాలేదన్నారు. కె.కొత్తపాలెంలోనే వరుస ఘటనలు జరుగుతున్నా గాయపడిన వారినే స్టేషన్‌కు పిలవడం సబబు కాదన్నారు. గాయపడిన నలుగురిలో ఇద్దరు బాలురు ఉన్నప్పటికీ దాడికి పాల్పడటం సరికాదన్నారు. ఇవే పునరావృతమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.





ఉల్లిపాలెం - వేణుగోపాలపురం, హరిపురం - సాలెంపాలెం మార్గంలో వంతెనలు

శిథిలావస్థలో వంతెనలు

● పట్టించుకోని అధికారులు, పాలకులు.. ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్న స్థానికులు

(ఆంధ్రజ్యోతి-కోడూరు): ఉల్లిపాలెం నుంచి వేణుగోపాలపురం, హరిపురం నుంచి సాలెంపాలెం వెళ్లే మార్గంలో రత్నకోడు డ్రెయిన్‌పై వంతెనలు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దకాలంగా కనీస మరమ్మతులకు నోచుకోలేదని, ప్రమాదమని తెలిసినా తప్పక ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వాహనదారులు, రైతులు చెబుతున్నారు. ఇటీవల భారీ వర్షాలకు వంతెనలు కూలతాయేమోనని ప్రజలు ఆందోళన చెందారు. ఉల్లిపాలెం నుంచి వేణుగోపాలపురం వెళ్లే రహదారి మధ్యలో వంతెన శిథిలమై పెచ్చులూడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. రెయిలింగ్‌లు విరిగిపోయాయి. ఎప్పుడు కూలుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు అంచనాలు వేస్తున్నామని వంతెనలు నిర్మిస్తామని అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చలేదని అంటున్నారు. వంతెనకు అనుసంధానమైన వేణుగోపాలపురం రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రత్నకోడు డ్రెయిన్‌పై హరిపురం వద్ద ఉన్న రెండో వంతెనకు రెయిలింగ్స్ విరిగి ఇనుప చువ్వలు బయపడ్డాయి. ఈ వంతెనపై నుంచి సాలెంపాలెం, నరసింహాపురం వెళతారు.

భయంతోనే పొలాలకు వెళుతున్నాం

వంతెనపై నుంచి భయంతోనే పొలాలకు వెళ్లి, వస్తున్నాం. ట్రాక్టర్లపై పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

- భూపతి నాగరాజు, ఉల్లిపాలెం

కూలిపోకముందే నిర్మించాలి

వంతెన శిథిలావస్థకు చేరిందని, వంతెన నిర్మించాలని పలు మార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేశాం. కూలిపోకముందే వంతెన నిర్మించాలి. **- తాతా పోతురాజు, హరిపురం**

అంచనాలు పంపాం

రత్నకోడుపై ఉల్లిపాలెం వంతెన నిర్మాణానికి అంచనాలు పంపాం. ప్రభుత్వం ఆమోదించాలి.

- రాజేశ్వరరావు, పీఆర్ ప్రాజెక్టు ఏఈ



కొడాలి-చల్లపల్లి రహదారి మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



లక్ష్మీపురం నుంచి పోడు వెళ్లే రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఏడు రోడ్ల మరమ్మతులకు రూ.1.80 కోట్లు

ఘంటసాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఏడు రోడ్ల మరమ్మతులకు రూ.1.80 కోట్లు విడుదలైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గుంతల రహదారి ఏపీ కార్యక్రమంలో భాగంగా శనివారం కొడాలిలో రహదారి మరమ్మతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మరో 12 రోడ్ల మరమ్మతులకు రూ.3.75 కోట్లు మంజూరు కావాల్సి ఉందన్నారు. కొడాలి-చల్లపల్లి ప్రధాన రహదారిని రూ.30 లక్షలతో, టి.కొత్తపాలెం- గుల్లల మోద రహదారిని రూ.30 లక్షలతో, ఘంటసాల-కొడాలి రహదారిని రూ.40 లక్షలతో, కొడాలి-శ్రీకాకుళం రహదారిని రూ.25 లక్షలతో, చల్లపల్లి- నడకుదురు రహదారిని రూ.15 లక్షలతో, భావదేవరపల్లి-సంగమేశ్వరం రహదారిని రూ.10 లక్షలతో, నాగాయలంక-నాలి రహదారిని రూ.30 లక్షలతో అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. తుమ్మల చౌదరిబాబు, కోన రాజశేఖర్, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వేమూరి సాయి వెంకట రమణ, తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) ఆర్ అండ్ బీ డీఈఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి సీతా హెచ్‌వీఎస్ నాగమణి పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీకాకుళం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త సోమిశెట్టి నాగులును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. దాతల సహకారంతో సేకరించిన రూ.10 వేలను ఎమ్మెల్యే అందజేశారు.

రూ.80 లక్షలతో రోడ్లకు మరమ్మతులు

కృత్తివెన్ను, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. మండలవ్యాప్తంగా రూ.80 లక్షలతో రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. లక్ష్మీపురం నుంచి పోడు వెళ్లే రహదారి మరమ్మతులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ పంచకర్ల సురేష్ పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడి..నలుగురు అరెస్టు

అవనిగడ్డ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగాయలంక, కోడూరు మండలాల్లో శనివారం నిర్వహించిన దాడుల్లో నాలుగు బెల్టు షాపులను గుర్తించి అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామశేషయ్య తెలిపారు. 197 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం

కోడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మందపాకల ఆర్సీఎం చర్చి వద్ద గల బడ్డీ కొట్టులో కడవకొల్లు శ్రీనివాసరావు మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావటంతో ఎస్ఐ చాణిక్య తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

పరస్పర ఫిర్యాదులు..

ఇరువర్గాలపై కేసు

కోడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో పరస్పర ఫిర్యాదులు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు. శుక్రవారం రాత్రి మందపాకల గ్రామానికి చెందిన కడవకొల్లు నరేష్, గాదె వెంకన్నబాబు తనపై కర్రతో దాడి చేశారని అదే గ్రామానికి చెందిన గాదె సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారని తెలిపారు. గాదె సుబ్రహ్మణ్యం, గాదె గోపి తమపై దాడి చేశారని గాదె వెంకన్న బాబు ఫిర్యాదు చేశారని తెలిపారు. వారిని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్ అవనిగడ్డ సమన్వయకర్తగా

అందె శ్రీరామ్మూర్తి



అవనిగడ్డ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా అందె శ్రీరామ్మూర్తిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో రెండు సార్లు ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా అవనిగడ్డ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయారు.

పట్టణ కన్వీనర్ పదవికి అప్పారావు రాజీనామా

పెడన : కాంగ్రెస్ పట్టణ పార్టీ కన్వీనర్ పదవికి సీహెచ్‌వీ అప్పారావు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పెడన నియోజకవర్గ సమన్వయకర్తగా శౌంతి నాగరాజును నియమించినందుకు నిరసనగా తాను పదవికి రాజీనామా చేశానని ఆయన పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ లోనే ఉంటానని, నాగరాజుతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

మంగినపూడి బీచ్ వద్ద యాత్రికులకు అన్ని ఏర్పాట్లు

● ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్

మచిలీపట్నం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌కు పుణ్యస్నానాలకు వచ్చే యాత్రికులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రూరల్ ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పౌర్ణమి ముందు వివిధ శాఖలతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కార్తీక మాసంలో ఆదివారాల్లో భారీగా యాత్రికులు వస్తారని తెలిపారు. మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు.

సీఎస్ఆర్ నిధుల కేటాయింపుపై

కలెక్టర్ బాలాజీకి కృతజ్ఞతలు

చల్లపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు వేగవంతం చేసేందుకు వెక్టా మిషన్‌ను సీఎస్ఆర్ నిధులతో అందించేందుకు కలెక్టర్ డీకే బాలాజీ నిర్ణయించడంపై సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఈవో పి.వి.మాధవేంద్రరావు కలిసి సర్పంచ్ విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.60లక్షలు జిల్లాకు కేటాయిస్తే అందులో రూ.30 లక్షలు వెక్టా యంత్రం కొనుగోలుకు కేటాయిస్తున్నట్లు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ తెలిపారన్నారు. సహకారం అందించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో

పొడతెగులు నివారణ

మోపిదేవి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు పొడ తెగులు ఆశిస్తోందని, దాని నివారణకు హెక్సాకొనజోల్ 250 మిల్లీలీటర్ల చొప్పున ఎకరాకు పిచి కారీ చేయాలని రైతు శిక్షణ కేంద్రం జిల్లా డీడీఏ జ్యోతిరమణి సూచించారు. సస్యరక్షణ చర్యలతో ఆశించిన దిగుబడులు సాధ్యమవుతాయని ఆమె పేర్కొన్నారు. కె.కొత్తపాలెంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

పశువుల్లో నట్టల నివారణకు ముందుగా టీకాలు వేయించుకోవాలి

గుడివాడ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో నట్టల నివారణకు ముందుగా టీకాలు వేయించుకోవాలని జిల్లా జేడీ కె.చిన్ననరసింహులు సూచించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం గుడివాడ ప్రగతి ఉపదృష్ట ఫౌండేషన్ సహకారంతో శనివారం బొమ్ములూరు పశువైద్యశాలలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం పశువులకు అందాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు సి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, ఏడీలు లక్ష్మీనారాయణ, ఉన్నంత హనుమంతరావు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ, గుడివాడ ప్రగతి అధ్యక్షుడు నల్లారి శేషగిరిరావు, వేణుబాబు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం!

- ఈదులమద్దాలి - యలమర్రు ఆర్ అండ్ బీ రోడ్డులోని చంద్రయ్య కాల్వ వంతెనపై కుంగిపోయిన వంతెన
- భయపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



విరిగిపోయిన వంతెన రివిట్‌మెంట్

పెదపారుపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులమద్దాలి - యలమర్రు ఆర్ అండ్ బీ రహదారి మధ్యలో చంద్రయ్య కాల్వ వంతెన మధ్యలో రోడ్డు కుంగిపోయింది. గుడివాడ - విజయవాడ వెళ్లే రహదారి గోతులమయమవ్వై కార్లు, లారీలు పెదపారుపూడి నుంచి ఈదులమద్దాలి - యలమర్రు, మర్రివాడ, ఉయ్యూరు, విజయవాడ వాహనాలు, లారీలు వెళ్లటం వల్ల వంతెన మధ్య కుంగిపోయింది. సంబంధిత అధికారులు వెంటనే పట్టించుకుని వంతెనకు మరమ్మతులు చేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా పట్టించుకుని వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఈదులమద్దాలి, చినపారుపూడి, యలమర్రు గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ



గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న కూటమి నాయకులు

గుడివాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని విజయ గ్యాస్ ఏజెన్సీలో దీపం-2 పథకం లబ్ధిదారులకు శనివారం ఉచిత గ్యాస్ సిలిండర్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ, ఎన్నికల్లో యిచ్చిన హామీల అమలు దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, నరేంద్ర మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, టీడీపీ నాయకులు వసంతవాడ దుర్గారావు, జగన్మోహనరావు, వీర్ల వెంకటేశ్వరరావు, అల్లాడ శ్రీనివాసరావు, పొట్లూరి కృష్ణారావు, పోలాసి ఉమా, గోకవరపు సునీల్, మహ్మమద్ రఫీ, గడ్డం ప్రకాష్‌దాసు, కోలవెన్ను గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు సూరే గాంధీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కూచిపూడిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

15 రోజుల్లో రీ సర్వే అర్జీల పరిష్కారం

కూచిపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో దొర్లిన తప్పులను సరి చేయటానికి కూచిపూడి గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో వచ్చిన అర్జీలను 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. గ్రామసర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, మండల సర్వేయర్ అనపర్తి కిషోర్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జగన్మోహనరావు, వీఆర్వో కాసీం, గ్రామ పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 18 అర్జీలు స్వీకరణ

పెదపారుపూడి : మండలంలోని చిన పారుపూడి రెవెన్యూ పరిధిలో శనివారం భూ సమస్యల పరిష్కారం కొరకు నిర్వహించిన గ్రామసభలో 18 అర్జీలు అందిస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుందరం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగుళ్ల శ్రీనివాసరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, కరిపినేని రాజేంద్ర ప్రసాద్, తాతినేని శ్రీనివాసరావు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడుకు ఘన నివాళి



ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెలమ సంఘం నాయకులు

గుడివాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీ ఎర్రన్నాయుడు 12వ వర్థంతి సందర్భంగా శనివారం స్థానిక నీలామహల్ రోడ్డులోని ఎర్రన్నాయుడు, తాండ్రపాపారాయుడు విగ్రహాలకు పట్టణ వెలమ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, అధ్యక్ష, కార్యదర్శులు గంటా ఆనంద్, గుల్లిపల్లి ప్రభాకరరావు, ఉపాధ్యక్షులు మూడెడ్ల రామారావు, సంఘ పెద్దలు బొడ్డు నారాయణ, శివశ్రీ, హరి, రంగారావు, రమేష్, శ్రీధర్, బ్రహ్మజీ, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, సుధాకర్, తెర్లి రాజేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు వితరణ



విరాళం అందజేస్తున్న దాతలు

గుడివాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటి మీద ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదా నానికి పట్టణానికి చెందిన కుంచిపర్తి నాగశతపతిరావు జ్ఞాప కార్థం ఆయన కుమారుడు కుంచిపర్తి సత్యనారాయణ, కుమార్తె జూపూడి వెంకటసుబ్బమ్మలు రూ.50వేలు శనివారం విరాళంగా ఆలయ కార్య నిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావుకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాలను, ప్రతిమను బహూకరించారు.

12 నుంచి వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు

స్థానిక పాటిమీద ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి 15వరకు వార్షిక పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



కూచిపూడిలో రహదారి మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న వర్ల కుమార్ రాజా

కూచిపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రహదా రుల లక్ష్యం కూటమి ప్రభుత్వ విధానమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం లో భాగంగా గుడివాడ నుంచి కొత్తపాలెం ఆర్ అండ్ బీ రహదారి మరమ్మతుల్లో భాగంగా కూచిపూడిలో శనివారం మరమ్మ తు పనులను ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రహదా రులను మెరుగుపర్చి ప్రజల ఇబ్బందులు తొలగించనున్నట్లు ఈ సందర్భంగా కుమార్ రాజా తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్టీ నేతలు లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీదాస్, కిలారపు మంగమ్మ, తాతా నారాయణరావు, శీలం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

పామర్రు: గ్రామాల సర్వతోముఖాభివృద్ధి సాధనలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ వారోత్సవాల్లో గ్రామాల అభివృద్ధికి ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బాధ్యతల స్వీకారం

గుడ్లవల్లేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ డివిజన్ ఆర్ డబ్ల్యూఎస్ డీఈగా పి.సత్యనారాయణ శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈయన బంటుమిల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పని చేస్తూ పదోన్నతిపై డీఈగా గుడివాడ డివిజన్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, తదితర ఏఈలు, సిబ్బంది అభినందించారు.

పెద్ద శివాలయం హుండీ ఆదాయం రూ.3.38 లక్షలు

గుడివాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఉన్న భీమేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమం శనివారం దేవదాయ శాఖ గుడివాడ తనిఖీదారు పర్యవేక్షణలో నిర్వహించారు. 7 నెలల 14రోజుల వ్యవధిలో రూ.3,38,890/-లు సమకూరినట్లు ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు తెలిపారు.

రహదారిపై గుర్తుతెలియని వృద్ధుడు మృతి

పామర్రు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం -విజయవాడ రహదారిపై పామర్రు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన ఓ గుర్తుతెలియని వృద్ధుడు (75)శనివారం మృతి చెందాడు. ఉదయం స్థానికులకు ఆ వృద్ధుడు రోడ్డుపై పాకుతూ అవస్థలు పడుతూ కనిపించాడు. మధ్యాహ్నం సమయంలో రోడ్డు పక్కన మార్జిన్లో ప్రాణాలు విడిచాడు. అతని ఒంటిపై చొక్కా మాత్రమే ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు అతని ఆచూకీ కోసం అన్వేషణ చేస్తున్నారు.

శశికళకు జిల్లా లయన్ ఆఫ్ ద మంత్ అవార్డు

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు అధ్యక్షులు నిమ్మగడ్డ శశికళ జిల్లా లయన్ ఆఫ్ ద మంత్ అవార్డును సాధించారు. నూతన సభ్యులను చేర్పించడం, ప్రతీ రోజూ సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం, వంటి కార్యక్రమాలు జిల్లాలో సెప్టెంబరులో ఉత్తమంగా చేసినందున ఈ అవార్డును జిల్లా లయన్స్ గవర్నర్ గద్దే శేషగిరి శనివారం ప్రకటించారు.



విశ్రాంతి భవనం ప్రారంభిస్తున్న గంధం వెంకటనారాయణ కుటుంబ సభ్యులు.. (ఇన్‌సెట్లో విశ్రాంతి భవనం)

అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో
విశ్రాంతి భవనం ప్రారంభం

పమిడిముక్కల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముళ్లపూడి అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల విశ్రాంతి ప్రాంగణం కుమ్మరవోలు శివలక్ష్మీ కుమారి, దుర్గాప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం గంధం వెంకటనారాయణ జ్ఞాపకార్థం ఆయన అల్లుడు దుర్గాప్రసాద్, కుమార్తె శివరూస్సీలక్ష్మి లక్ష రూపాయలతో విశ్రాంతి ప్రాంగణం నిర్మించారు. సీతారామాం జనేయస్వామి దేవస్థానం, ముళ్లపూడి మానవతా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఆలయాల నిర్మాణం, అభివృద్ధి నిధికి వెంకట నారాయణ, ఆయన కుటుంబ సభ్యులు భూరి విరాళాలు ఇవ్వటం అభినందనీయమన్నారు.

మర్యాదపూర్వక కలయిక

అట్లాంటాలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన చాపరాల రాకేశ్

గుడ్లవల్లేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనలో భాగంగా అట్లాంటా వెళ్లగా ఆయన్ను, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములను గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ కుమారుడు చాపరాల రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాకేష్ అమెరికాలో అట్లాంటా నగరంలో స్థిరపడ్డారు. చాపరాల బాలాజీ కుటుంబం తన గెలుపునకు పనిచేశారని రాము రాకేష్‌ను పరిచయం చేయగా లోకేశ్ అభినందించారు.



అట్లాంటాలో నారా లోకేశ్‌తో చాపరాల రాకేశ్

ఘనంగా పవిత్ర కార్తీక మాసోత్సవాలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

గుడివాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం ప్రారంభం కావడంతో శనివారం పట్టణంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే స్వామికి వేద పండితులు విశేష అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానం(పెద్ద శివాలయం), శ్రీగౌరీశంకరస్వామి దేవస్థానం(చిన్న శివాలయం)లలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయాల కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు.



గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



భీమేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



కూచిపూడిలో దీపాలంకరణ నిర్వహిస్తున్న భక్తులు

గుడ్లవల్లేరు: మండలంలో శివాలయాలు భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి. గుడ్లవల్లేరు శ్రీ గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో, కన్యకాపరమేశ్వరి పంచాయుత క్షేత్రంలో, కౌతవరం గౌతమేశ్వరస్వామి ఆలయం, వడ్లమన్నాడు, విన్నకోట, డోకిపర్రు, అంగలూరు శివాలయాలలో కార్తీక పూజలు ప్రారంభించారు.

కూచిపూడి: గ్రామాల్లోని దేవాలయాల్లో కార్తీక మాసపు పూజలు ప్రారంభమయ్యాయి. చినముత్తేవి, కూచిపూడి, పెదపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, పెదసనగల్లు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి.